# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## **ప్రాంతీయ వార్తలు**

**తేది : 04-12-2024** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు**
2. **ఆంధ్రప్రదేశ్ శాసన మండలి తూర్పు-పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గ ఉప ఎన్నిక పోలింగ్ రేపు జరగనుంది.**
3. **ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఈ రోజు నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ పేర్కొన్నారు.**
4. **స్వాతంత్ర్య సమర యోధులు, సంఘసంస్కర్త ఉన్నవ లక్ష్మీనారాయణ జయంతి ఈ రోజు.**

**===========================**

రాష్ట్రంలోని సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులకు మెరుగైన సదుపాయాలు కల్పిస్తామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తెలిపారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బోగోలు లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకులాన్ని ఆయన నిన్న రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ..

,..వాయిస్...30 సెకన్లు

-------------------------

ఆంధ్రప్రదేశ్ శాసన మండలి తూర్పు-పశ్చిమ గోదావరి ఉపాధ్యాయ నియోజకవర్గ ఉప ఎన్నిక పోలింగ్ రేపు జరగనుందని రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది. తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ, కాకినాడ, ఏలూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో రేపు ఉదయం 8.00 నుండి సాయంత్రం 4.00 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని పేర్కొంది. ఓటు హక్కు ఉన్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపింది.ఎన్నికల్లో ఓటు వేసేందుకు ఓటర్లకు ప్రత్యేక సాధారణ సెలవును మంజూరు చేస్తున్నట్లు తూర్పు గోదావరి జిల్లా రెవిన్యూ అధికారి టి. సీతారామ మూర్తి ఒక ప్రకటనలో తెలియచేశారు.

-------------------------

రాష్ట్రంలోని అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలు- కేజీబీవీల అభివృద్ధికి 2.52 కోట్ల రూపాయల నిధులు మంజూరు అయ్యాయని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కేజీబీవీ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులను

ప్రభుత్వం మంజూరు చేసిందని చెప్పారు. ఈ నిధులతో జిల్లాలోని రాయచోటి, రామాపురం, లక్కిరెడ్డిపల్లి, చిన్నమండెం, గాలివీడు, సంబేపల్లి మండలాలలోని కేజీబీవీ పాఠశాలల్లో కంప్యూటర్ ల్యాబ్, గ్రంథాలయం, మరమ్మతుల పనులను చేపడతామని మంత్రి వివరించారు.

---------------------------

రాష్ట్రంలో ఈ నెల 6వ తేదీ నుంచి ప్రారంభమయ్యే రెవెన్యూ గ్రామ సదస్సుల నిర్వహణపై రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా మార్గదర్శకాలు జారీచేశారు. రెవెన్యూ సదస్సులు వచ్చే నెల 8వ తేదీ వరకు మొత్తం 33 రోజుల పాటు జరుగుతాయని తెలిపారు. ఈ ఫిర్యాదులు, వినతులపై 45 రోజుల్లోగా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. రెవెన్యూ సదస్సుల్లో అన్నిరకాల భూ సమస్యలపై ఫిర్యాదులు, వినతులు స్వీకరించాలని తెలిపారు. పరిష్కార చర్యలు తీసుకున్నట్లు బాధితులకు తెలుగులోనే రసీదు, తిరుగు సమాధానం ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రతిజిల్లాలో ఓ గ్రామసదస్సును జిల్లా మంత్రి ప్రారంభిస్తారని, జిల్లా కలెక్టర్, సహాయ కలెక్టర్లు, ఇతర అధికారులు ఈ సదస్సుల్లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

---------------------------

పత్తి రైతులకు కనీసమద్దతు ధర కల్పించే లక్ష్యంతో ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా ఈరోజు నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభించినట్లు జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. జిల్లాలోని జగ్గయ్యపేట, కంచికచర్ల, నందిగామ, మైలవరం, మార్కెట్ కమిటీల పరిధిలో 14 జిన్నింగ్ మిల్లులతో పాటు, భారత పత్తి సమాఖ్య సీసీఐ ఆధ్వర్యంలో ఈ కొనుగోళ్ళు జరుగుతున్నాయని తెలిపారు. ఇందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. క్వింటాల్ పత్తికి 7 వేల 5 వందల 21 రూపాయల కనీస మద్దతు ధరను సీసీఐ నిర్ణయించిందని ఆ మేరకు కొనుగోలుదారులు పత్తి కొనుగోలు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

---------------------------

ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ కార్యక్రమంలో భాగంగా విజయవాడలోని ప్రణాళిక, వాస్తుకళ విద్యాలయం కళాశాల ఆధ్వర్యంలో రాష్ట్రానికి చెందిన విద్యార్థులు 5 రోజుల పాటు ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో పర్యటించారు. పర్యటన నుండి విద్యార్థుల బృందం నిన్న విజయవాడకు చేరుకుంది. దేశంలోని విభిన్న సంస్కృతులు, ఆచారాల గురించి విద్యార్థులు తెలుసుకోవడానికి ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ వంటి కార్యక్రమాలు దోహదపడతాయని విజయవాడ స్కూల్ ఆఫ్ ప్లానింగ్ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ సిహెచ్ వెంకట మణికంఠ ఈ సందర్భంగా తెలియజేస్తూ...

వాయిస్ ( 33 సెకన్లు

---------------------------

స్వాతంత్య సమర యోధులు, సంఘసంస్కర్త ఉన్నవ లక్ష్మీనారాయణ జయంతి ఈరోజు. స్త్రీ విద్య, వితంతు వివాహాలను ప్రోత్సహించిన లక్ష్మీనారాయణ డిసెంబర్ 4, 1877న గుంటూరు జిల్లా వేములూరుపాడు గ్రామంలో జన్మించారు. స్వాతంత్రోద్యమంలో భాగంగా పల్నాడులో జరిగిన పుల్లరి సత్యాగ్రహం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాల్లో పాల్గొని అనేక సార్లు కారాగార శిక్ష అనుభవించారు. స్త్రీ విద్య ప్రోత్సాహానికి గుంటూరులో1922లో 'శారదానికేతన్' స్థాపించి ఎందరో బాలికలకు చదువుకునే అవకాశం కల్పించారు. ఉన్నవ లక్ష్మీనారాయణ రచించిన "మాలపల్లి" నవల తెలుగు సాహిత్యంలో ఒక గొప్ప అభ్యుదయ రచనగా పేరుపొందింది.

---------------------------

ఖరీఫ్ పంటలకు 2 శాతం, రబీ పంటలకు 1.5 శాతం, వాణిజ్య పంటలకు 5 శాతం ప్రీమియంతో బీమా అందుబాటులో ఉందని వ్యవసాయశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు.రైతులు గడువుకు ముందు ప్రీమియం చెల్లించాలని సూచించారు. అలాగే రబీ నుంచి మామిడి పంటలకు బీమా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. సవరించిన వాతావరణ ఆధారిత బీమా పథకం మేరకు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ డైరెక్టర్‌ను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ కేంద్ర ప్రాంతీయ వార్తావిభాగానికి తెలియజేస్తూ......

.....వాయిస్.... 25 సెకన్లు....

---------------------------

యువతను దేశ సాంస్కృతిక వారసత్వంతో అనుసంధానించేందుకు “కృష్ణవేణి సంగీత నీరాజనం” ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు సాంస్కృతికశాఖ కార్యదర్శి వినయ్‌చంద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు మూడు రోజుపాటు నిర్వహిస్తామని చెప్పారు. విజయవాడలోని శ్రీ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో, శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో కృష్ణా నది ఘాట్ ప్రాంతాల్లో మూడు రోజులపాటు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. సంగీత పర్యాటకాన్ని ప్రోత్సహించడంలో భాగంగా కేంద్ర పర్యాటక మంత్రిత్వ శాఖ, రాష్ట్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖలు ఈ కార్యక్రమాన్ని సంయుక్తంగా నిర్వహిస్తున్నాయని తెలిపారు.

---------------------------

విజయవాడలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో జనవరి రెండో తేదీ నుంచి 12వ తేదీ వరకు పుస్తక మహోత్సవం నిర్వహిస్తున్నట్లు విజయవాడ బుక్ ఫెస్టివల్ సొసైటీ తెలిపింది. ఈ పుస్తక మహోత్సవాల్లో భాగంగా ఆరుద్ర, దాశరథి కృష్ణమాచార్యులు, నాజర్, నార్ల చిరంజీవి, ఆలూరి బైరాగి, ఎన్.నటరాజన్, చలన చిత్రనటి భానుమతి శత జయంతి సభలు నిర్వహిస్తామని పేర్కొంది. విజయవాడలో ఈ నెల 6వ తేదీన బుక్ ఫర్ వాక్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, దేశవ్యాప్తంగా 250 మంది ప్రచురణకర్తలు పుస్తక ప్రదర్శనలో పాల్గొంటారని తెలియచేసింది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించాల్సిన సాగునీటి సంఘాల ఎన్నికలను రాష్ట్ర ప్రభుత్వం వాయిదా వేసింది. ఈ మేరకు ప్రభుత్వం జిల్లాల కలెక్టర్లకు సమాచారం అందజేసింది. ఈనెల 5 నుంచి సాగునీటి సంఘాల ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కావాల్సి ఉండగా.. తుపాను, భారీ వర్షాల వల్ల వాయిదా వేస్తున్నట్లు తెలిపింది. తదుపరి నోటిఫికేషన్ జారీ తేదీని త్వరలో వెల్లడిస్తామని ఉత్తర్వుల్లో పేర్కొంది.

---------------------------

రాష్ట్ర పాఠశాల విద్యాశాఖలోని ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష అభియాన్ విభాగం జాతీయ స్థాయిలో ఉత్తమ రాష్ట్రం పురస్కారానికి ఎంపికయ్యింది. దివ్యాంగ విద్యార్థుల హక్కుల చట్టం అమలుకుగాను రాష్ట్రానికి ఈ పురస్కారం లభించింది. ఇటీవల ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సమగ్ర శిక్ష

పథక రాష్ట్ర సంచాలకులు బి. శ్రీనివాసరావుకు ఈ పురస్కారాన్ని ప్రదానం చేశారు.

--------------------------

తెలుగు రాష్ట్రాల్లో పలుచోట్ల ఈ రోజు స్వల్ప భూ ప్రకంపనలు చోటు చేసుకున్నాయి. ఈ ఉదయం 7 గంటల 27 నిమిషాలకు కొన్ని సెకన్ల పాటు భూమి కంపించింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. తెలంగాణలోని ములుగు జిల్లా మేడారంలో భూకంప కేంద్రాన్ని గుర్తించారు.

======================